

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 27.0
తణుకు : 32.0 - 26.0

మీ సమస్యలు పరిష్కరిస్తా

» మత్స్యకారులకు కలెక్టర్ హామీ



నరసాపురం రూరల్, జూలై 13 :తీర ప్రాంత గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ నాగరాణి హామీ ఇచ్చారు. శనివారం ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌ఛార్జ్ రామరాజులతో కలిసి వేములదీవి గ్రామాన్ని సందర్శించారు. అక్కడ స్థానిక మత్స్యకారులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'గ్రామంలో ఏర్పాటు చేయాల్సిన గురుకుల పాఠశాలను అప్పటి ప్రభుత్వం పట్టణానికి తరలించింది. దీనిని తిరిగి ఇక్కడ ఏర్పాటు చేసి జూనియర్ కాలేజీగా అభివృద్ధి చేయాలి. అలాగే తాగునీటి సమస్య అధికంగా వుంది. దీనిని పరిష్కరించాలి. బియ్యపుతిప్ప హార్బర్ ఏర్పాటు చేయాలి' అంటూ గ్రామస్థులు వాతాడి ఉమా, మైలా వసంతరావు, అడ్డాల శ్రీను, సీతా మహాలక్ష్మి కలెక్టర్‌ను కోరారు. దీనిపై ఆమె అధి కారులతో చర్చించి, త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. పట్టణంలోని మొగల్తూరు రోడ్‌లో వున్న మహిళా మార్ట్‌ను సందర్శించి అమ్మకాలపై ఆరా తీశారు.

నూతన ఎస్పీలు పశ్చిమకు నయీమ్.. ఏలూరుకు కిశోర్

» విశాఖ సిటీ డిప్యూటీ కమిషనర్-1గా అజిత వేజెండ్ల బదిలీ

» డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని మేరీ ప్రశాంతికి ఆదేశం

భీమవరం క్రైం, జూలై 13 : వివిధ జిల్లాల ఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీగా అదనాన్ నయీమ్ అస్మి, ఏలూరు ఎస్పీగా కొమ్మి ప్రతాప్‌శివకిశోర్‌లను నియమించింది. పశ్చిమ ఎస్పీగా పని చేసిన అజిత వేజెండ్లను విశాఖ సిటీ డిప్యూటీ కమిషనర్-1గా బదిలీ చేశారు. ఏలూరు ఎస్పీగా పనిచేసిన మేరీ ప్రశాంతిని డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన నయీమ్ అస్మి 2013 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఆయన ఈ ఏడాది జనవరి 13న కృష్ణా జిల్లా ఎస్పీగా నియమితులై మేలో జరిగిన సాధారణ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమర్థవంతంగా నిర్వహించారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన శివకిశోర్ 2019 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఏఎస్పీ గ్రేడ్-1 అధికారిగా అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతపల్లి సబ్ డివిజన్‌లో పని చేస్తున్నారు.

ప్రస్తుత ఎస్పీ అజిత వేజెండ్ల ఈ ఏడాది ఫిబ్రవరిలో గుంటూరు నుంచి బదిలీపై వచ్చారు. మేలో జరిగిన సాధారణ ఎన్నికల నిర్వహణలో జిల్లా కలెక్టర్‌తో కలిసి పూర్తి స్థాయిలో బాధ్యత తీసుకుని ఎన్నికలను సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. జిల్లా ఏర్పడ్డాక నూతనంగా వచ్చిన యు.రవిప్రకాశ్ బదిలీపై వెళ్ళడంతో అజిత రెండో ఎస్పీగా వచ్చారు.

ఏలూరులో జరిగిన ఒక యువతిపై యాసిడ్ దాడి, హత్య కేసులో 48 గంటల్లోనే నిందితులను అరెస్టు చేయగా వారిలో ముగ్గురికి 108 రోజుల్లోనే స్పీడ్ ట్రైల్ కోర్టులో భాగంగా జీవిత ఖైదు పడే విధంగా ఎస్పీ మేరీ ప్రశాంతి కృషిచేశారు. ఆమె బాధ్యతలు చేపట్టిన తర్వాత మహిళలకు సంబంధించిన 17 కేసుల్లో జీవిత ఖైదు శిక్షలు పడ్డాయి. కోర్టు స్పెషల్ మానిటరింగ్ సెల్ విభాగాలను ఏర్పాటు చేసి, గ్రేవ్ కేసులపై పర్యవేక్షణ చేసి శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టారు.



నయీమ్



కిశోర్



వి.అజిత



మేరీ ప్రశాంతి

గత ప్రభుత్వాల హయాంలో..

పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో భాగంగా ఉచితంగా వాహనాలు ఇచ్చేవారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చేవి. లేదంటే ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని దిశా నిర్దేశం చేసేవి.

వైసీపీ హయాంలో..

పట్టణాల్లో చెత్త సేకరణకు వాహనాలను సమకూర్చే బాధ్యతను పుణే ఏజెన్సీకి అప్పగించారు. ప్రతి వాహనానికి నెలవారీ వాయిదాను మున్సిపాలిటీలే చెల్లించాయి. మున్సిపాలిటీలు ప్రజల నుంచి చెత్త పన్నును వసూలు చేసి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు జమ చేస్తే, అక్కడి నుంచి ఏజెన్సీకి సొమ్ములు వెళ్లేవి. ఇలా ఇప్పటి వరకు కోట్ల రూపాయలు చెల్లించారు. ఇంకా చెల్లిస్తూనే వున్నారు. దీనివల్ల మున్సిపాలిటీలకు కోట్లలో నష్టం చేకూరింది.

చెత్త దోపిడీ

- » మున్సిపాలిటీలకు వైసీపీ గుదిబండ
- » చెత్త సేకరణకు 129 ఏజెన్సీ వాహనాలు
- » ఒక్కోదానికి నెలకు రూ.56 వేలు..
- » మూడేళ్లకు చెల్లించిన మొత్తం రూ.26 కోట్లు
- » చెత్త పన్ను వసూలు.. ఏజెన్సీకి చెల్లింపులు
- » ప్రభుత్వ వాహనాలున్నా.. ప్రైవేటుకే మొగ్గు
- » తాడేపల్లిగూడెంలో చెల్లింపుల నిలిపివేత
- » మిగిలిన పట్టణాలు తేరుకోకుంటే భారీ నష్టం



వైసీపీ హయాంలో..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీ మున్సిపాలిటీలకు సమకూర్చిన ఒక్కో వాహనానికి ప్రతి నెలా రూ.56 వేలు చెల్లించాలి. ఇందులో రూ.15 వేలు డ్రైవర్‌కు వేతనం, డీజిల్‌కు రూ.10 వేలు ఖర్చు చేస్తే మిగిలిన రూ.31 వేలు ఏజెన్సీకి మిగులుతుంది. ఈ లెక్కన ఒక్కో వాహనానికి ఏడాదికి రూ.3.72 లక్షలు చొప్పున మూడేళ్లకు రూ.11.16 లక్షలు ఖర్చు పెట్టారు. ఆవాసాలకు అనుగుణంగా చెత్త సేకరించేందుకు భీమవరం 35, తాడేపల్లిగూడెం 34, తణుకు 24, పాలకొల్లు 20, నర్సాపురం 16 వెరసి మొత్తం 129 వాహనాలను సమకూర్చారు. అంటే ఈ మొత్తం వాహనాలకు మూడేళ్లలో చెల్లించిన మొత్తం రూ.26 కోట్లు. ఇంతకీ ఆ వాహనం విలువ ఎంతంటే రూ.3.50 లక్షలకు మించి ఉండదు. మున్సిపాలిటీలు మాత్రం మూడు రెట్లకు పైగా సొమ్ములు చెల్లించాయి. ఇంకా చెల్లిస్తూనే వున్నాయి. అయినా వాహనాలు మాత్రం మున్సిపాలిటీకి చెందలేదు. ఏజెన్సీ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. వీటి నిమిత్తం ప్రజల నుంచి మున్సిపాలిటీల్లో ఒక్కో రకంగా పన్ను వసూలు చేశారు. వీటిని ఏజెన్సీకి అప్పగించారు. పెద్ద మొత్తంలో ఏజెన్సీకి లాభం చేకూరింది. మున్సిపాలిటీలు సొమ్ములు చెల్లించకపోతే ఓ మహిళా ఐఏఎస్ అధికారిణి రంగంలోకి వచ్చేవారు. మున్సిపాలిటీలపై ఒత్తిడి తెచ్చి మున్సిపల్ నిధుల నుంచి చెత్త వాహనాలకు సొమ్ములు ఇప్పించేవారు.

కమీషన్ల కోసం ప్రజలపై భారం

చెత్త సేకరణలో మున్సిపాలిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. అయినా వాహనాలు ఏజెన్సీకే ఉన్నాయి. మున్సిపాలిటీలకు ఇచ్చి వుంటే ఈపాటికే వాయిదాల రూపంలో రుణాలు చెల్లించేవారు. మున్సిపాలిటీలపై ఇన్ని కోట్ల భారం పడేది కాదు. వైసీపీ హయాంలో కేవలం కమీషన్ల కోసమే వాహనాలను ఏజెన్సీ ద్వారా సమకూర్చారు. ప్రభుత్వ వాహనాలు ఉన్నా మున్సిపాలిటీ నుంచి ట్రాక్టర్‌లు.. ఇతర వాహనాలు చెత్త సేకరణలో పనిచేస్తున్నాయి. దీనిపై కూటమి ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టారు.



పన్ను రద్దుతో మరింత భారం

ప్రజల నుంచి చెత్త పన్ను వసూలు చేయకూడదంటూ కూటమి ప్రభుత్వం స్పష్టం చేయడంతో వాటిని నిలిపివేశాయి. ఒప్పందం మేరకు ప్రతి నెలా మున్సిపాలిటీలు సొమ్ములు చెల్లించాల్సి వస్తోంది. ఈ విషయమై ప్రభుత్వం దృష్టి సారించకుంటే మున్సిపాలిటీలకు తీవ్ర నష్టం తప్పదు. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలు ఏడాదికి సుమారు రూ.9 కోట్లు మేర చెత్త సేకరించే వాహనాలు జమ చేయాలి.

తాడేపల్లిగూడెంలో బ్రేక్

తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చెత్త సేకరించే వాహనాలపై సమీక్షించి మున్సిపాలిటీకి నష్టం వాటిల్లిందని గ్రహించారు. ఇకపై వాహనాలకు సొమ్ములు చెల్లించకూడదంటూ ఆదేశాలు జారీచేశారు. సొంత వాహనాలతోనే చెత్త సేకరించుకోవచ్చని స్పష్టం చేశారు.



కూటమి పాలనలో..

సంపద సృష్టి

భీమవరంలో ప్రయోగం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దిశా నిర్దేశం

స్థలాల ఎంపికకు అధికారుల కసరత్తు

భీమవరం టౌన్, జూలై 13 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భీమవరం చెత్త సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పట్టణంతోపాటు భీమవరంలోను చెత్తతో సంపద సృష్టించటం ద్వారా డంపింగ్ యార్డు సమస్యలకు పరిష్కారం చూపాలని భావిస్తున్నారు. పవన్ ఆదేశాలపై ఇప్పటికే రెండు పర్యాయాలు రాష్ట్ర సాలిడ్ అండ్ లిక్విడ్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు అడ్వైజర్ శ్రీనివాస్ భీమవరం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి వివరాలు సేకరించారు. యనమదుర్రు గట్టుపై వున్న కంపోస్టు గుట్టలను పరిశీలించారు. అధికారులతోను, సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల 39 వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహించే వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు, సిబ్బందికి ఘన వ్యర్థ నిర్వహణ, మురికి వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. మునిసిపల్ స్థలాలను గుర్తించే చర్యలు చేపట్టారు.



• ప్రతి వార్డులో శుద్ధి కేంద్రం

భీమవరం పట్టణంలో వ్యాపార సంస్థలు, నివాసాల నుంచి ప్రతీ రోజు 80 టన్నుల చెత్తను సేకరించి తాత్కాలిక డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఒక్కోసారి యనమదుర్రు కాల్వ గట్టునే ఉపయోగిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో పవన్‌తోపాటు ఎమ్మెల్యే అంజిబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు అమలులోకి దిగారు. తాజాగా డంపింగ్ యార్డుతో నిమిత్తం లేకుండా ప్రతీ వార్డులోను శుద్ధి కేంద్రం ద్వారా చెత్త సమస్యకు పరిష్కారం చూపాలని భావిస్తున్నారు. ఇప్పటికే వార్డుల్లో వున్న మునిసిపల్ భవనాలను గుర్తించారు. అక్కడకు తడి, పొడి చెత్తను వేరు చేయనున్నారు. పొడి చెత్త ఒక వైపు, తడి చెత్తను మరో వైపు తరలించి తడి చెత్త ద్వారా వర్మికంపోస్టు తయారు చేయనున్నారు. పొడి చెత్తను విద్యుత్ కేంద్రానికి తరలించనున్నారు. దీనివల్ల డంపింగ్ యార్డు అవసరం ఉండదు. దీంతో పరిష్కారం లభిస్తుంది. మునిసిపాల్టీకి ఆదాయం సమకూరుతుంది. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని అంబికా నగరంలో చెత్తను సేకరించి వర్మి కంపోస్టు తయారు చేయడంతో అది పరిశుభ్ర నగరంగా మారింది. అదే మోడల్‌ను భీమవరం, పిఠాపురంలోను అమలు చెయ్యాలని పవన్ శ్రద్ధ చూపుతున్నారు.

అవగాహన కల్పించండి:ఎమ్మెల్యే అంజిబాబు

పట్టణంలో చెత్త సమస్య పరిష్కారానికి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అంజిబాబు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల మునిసిపాల్టీలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆదేశించారు. ఇంటిలోని చెత్తను బయట వేయకుండా చెత్త వాహనం వచ్చినపుడే ఇచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. అవసరమైతే చెత్తను బయటవేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని సూచించారు. ముందుగా కొన్ని వార్డులను ఎంపిక చేసిన చర్యలు తీసుకుని మంచి ఫలితాలు సాధించిన తరువాత మిగతా వార్డుల్లో అమలు చేసేలా ప్రణాళిక సిద్ధం చెయ్యాలన్నారు.



మునిగిన నారుమడి నుంచి నీటిని తోడుతున్న దృశ్యం

డ్రెయిన్ల ప్రవాహానికి చెత్తే అడ్డంకి

» వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. ముంపులో నారుమడులు

» చెత్త తొలగింపు ప్రయత్నాలు ఫలిస్తేనే నీరు లాగేది

భీమవరం టౌన్/రూరల్, జూలై 13: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సార్వా నారుమడులను ముంపు వదలడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం డ్రెయిన్లపై చూపిన నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ఈ ఏడాది సార్వా సాగులో ఆది నుంచి వర్షాలు అధికంగా పడటం నారుమడులు వర్షానికి ముంపునకు గురవుతున్నాయి. శనివారం జిల్లావ్యాప్తంగా 8.25 మి.మీ. వర్షం పడడంతో.. పంట భూముల్లోని నారుమడుల్లో రెండు అడుగుల నీరుచేరింది. ఈ పరిస్థితులను ముందుగా అంచనా వేసిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త తొలగింపునకు రూ.9.98 కోట్లు మంజూరుచేశారు. ఈ మేరకు కొన్ని రోజులుగా చెత్తను తొలగిస్తున్నారు. అయితే డ్రెయిన్లలో పూర్తిస్థాయిలో తొలగిస్తేనే చెత్త బయటకు వెళుతుంది. ఆ దిశగా ప్రయత్నాలు జరగాలి. జిల్లాలో రెండు లక్షల 11 వేల ఎకరాల సార్వా సాగుకు పది వేల ఎకరాలలో నారుమడులు వేశారు. డెల్టాలో వేసిన ఐదు వేల ఎకరాల నారుమడులు ముంపునకు గురయ్యాయి. 25 వేల ఎకరాలలో నాట్లు వేశారు. తణుకు, పెంటపాడు, ఆచంట, అత్తిలి, గణపవరం, తాడేపల్లిగూడెం ప్రాంతాలలో నాట్లు పడ్డాయి. నాట్లు వేసిన చేలల్లోకి వర్షపు నీరు అధికంగానే చేరింది. మరింత వర్షం కురిస్తే నాట్లు ముంపునకు గురవుతాయని రైతులు అంటున్నారు.

భీమవరంలో అత్యధిక వర్షం

రుతు పవనాల ప్రభావంతో నాలుగు రోజులుగా జిల్లా అంతటా వర్షాలు పడుతున్నాయి. శనివారం ఉదయం వరకు నమోదైన వర్షపాత వివరాలివి. భీమవరంలో అత్యధికంగా 70.6 మి.మీ., ఉండి 67.2, నరసాపురం 64.6, యలమంచిలి 64, పాలకొల్లు 55.4, ఇరగవరం 54, ఆకివీడు 50.2, మొగల్తూరు 49.2, అత్తిలి 47.8, పాలకోడేరు 40.8, ఆచంట 40.2, పోడూరు 33.6, వీరవాసరం 30.2, పెనుమంట్ర 29.4, పెనుగొండ 26.6, గణపవరం 23.6, తాడేపల్లిగూడెం 22.2, తణుకు 21.4, కాళ్ళ 17.2, పెంటపాడు 17 మి.మీ వర్షపాతం నమోదైంది.

టిప్పర్ లారీల సమ్మె ఉధృతం

మూడు జిల్లాల్లో ఇసుక ఇబ్బందులు

నిలిచిన భవన నిర్మాణ పనులు

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి పైలట్ ప్రాజెక్టు

5

» సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసమూర్తి

- తాడేపల్లిగూడెం సమీపంలోని దర్శిపర్రు పరిధిలోని పలుచోట్ల పంట చేలు, బోదెలను పూడ్చి లే అవుట్‌లు మార్చేశారు. ఈ కారణంగా పంట చేలకు వచ్చే మురుగు నీరు బయటకు వెళ్లే అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పంట కూడా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి. ఈ సమస్య ఒక్క తాడేపల్లిగూడెంలోనే కాదు. జిల్లావ్యాప్తంగా ఉన్న నాన్ లే అవుట్‌లు వేసిన ప్రతీచోటా కనిపిస్తోంది. జిల్లాలోని 19 మండలాల్లో ఏకంగా 2155 నాన్ లే అవుట్‌లు ఉన్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం అవుతోంది.

- తాడేపల్లిగూడెం పట్టణంలోని యాగర్లపల్లికి ఆనుకుని ఓ అనధికార లే అవుట్ వేశారు. దీనికోసం 15 ఎకరాల వ్యవసాయ భూమిని పూడ్చి సైట్‌లుగా విడదీశారు. వీటిని కొందరు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే కట్టిన ఇళ్లకంటే.. ఖాళీ స్థలాలే ఇక్కడ ఎక్కువగా వున్నాయి. ఇది లోతట్టు ప్రాంతం కావడం, రోడ్లు, డ్రెయిన్లు లేకపోవడంతో వర్షాకాలం ముంపులో ఉంటుంది. ఇక్కడ ప్రజలు బయటకు రాలేని దుస్థితితో సతమతం అవుతున్నారు.



- » ముంచుతున్న అనధికార లే అవుట్‌లు
- » ముంపులోనే పంట చేలు, ఖాళీ స్థలాలు
- » ఇటు రైతులు, అటు ప్రజలకు అవస్థలు

కదలని నీరు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 13: జిల్లావ్యాప్తంగా గడిచిన నాలుగు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. పొలాల చుట్టుపక్కల వున్న అనధికార లే అవుట్‌ల కారణంగా.. పలుచోట్ల ముంపు నీటిని బయటకు పంపించే అవుట్ లెట్‌లు పూడుకుపోయాయి. ఫలితంగా అవి ముంపులోనే వున్నాయి. దీనికితోడు పట్టణాలు, గ్రామాల్లోని ఈ లే అవుట్‌లలో సరైన డ్రెయిన్‌లు, రోడ్లు లేకపోవడంతో ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉంటున్నది. రోజుల తరబడి ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. సమీపంలో ఇళ్లు నిర్మించుకున్న ప్రజలు నరకం చూస్తున్నారు. జిల్లాలో అనధికారికంగా రెండు వేల 155 లే అవుట్‌లు ఉన్నాయి. అత్యధికంగా పాలకొల్లులోని 20 గ్రామాల్లో 789 అనధికార లే అవుట్‌లను గుర్తించారు. అత్యల్పంగా పెంటపాడులో 22 ఉన్నాయి. ఆయా గ్రామాలు పట్టణాలలో నాన్‌లేఅవుట్‌ల విషయంలో అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ సమస్య ఉత్పన్నమైన సమయంలో అనధికార లే అవుట్‌లలో ఏదో తూతూమంత్రంగా ఒక రోడ్డు ధ్వంసం చేసి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. పర్యవసానంగా ఈ అనధికార లే అవుట్‌ల వ్యవహారంతోనే జిల్లాలో అంతటా ముంపు ముప్పు తొంగి చూస్తోంది.

అనధికార లే అవుట్‌ల జాబితా

మండలం	గ్రామాలు	లే అవుట్‌లు
1 ఆకివీడు	5	34
2 అత్తిలి	14	49
3 భీమవరం	9	92
4 కాళ్ల	13	104
5 పాలకోడేరు	14	174
6 పెంటపాడు	22	22
7 తాడేపల్లిగూడెం	11	192
8 ఉండి	9	36
9 వీరవాసరం	14	136
10 ఆచంట	6	34
11 యలమంచిలి	12	38
12 ఇరగవరం	21	88
13 మొగల్తూరు	4	23
14 నరసాపురం	13	94
15 పాలకొల్లు	20	789
16 పెనుగొండ	15	42
17 పెనుమంట్ర	18	83
18 పోడూరు	11	52
19 తణుకు	9	73
మొత్తం		2,155





ఉండి బస్టాండ్‌లో నిలిచిన నీరు





ఉండిలో.. ఇంటిలోకి వచ్చిన నీటిని తోడుతున్న మహిళ.. మునిగిన రోడ్డు

జగదభిరామునిగా జగన్నాథుడు



శ్రీరామునిగా దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకా తిరుమల, జూలై 13: జగదభి రామునిగా జగన్నాథుడు శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలోని మండపంలో సీతాసమేత శ్రీరామచంద్రమూర్తిగా జగన్నాథుని దర్శనం భక్తజనులను అలరించింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.




సీఎంకు రూ.కోటి విరాళం అందిస్తున్న ఎస్‌ఎల్‌వీ గ్రూప్ చైర్మన్ శ్రీనివాసరాజు

అన్న క్యాంటీన్ల నిర్వహణకు కోటి విరాళం

▸ సీఎంకు ఎస్‌ఎల్‌వీ గ్రూపు చైర్మన్ శ్రీనివాసరాజు చెక్కు అందజేత

భీమవరం టౌన్, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే అన్న క్యాంటీన్లకు భీమవరానికి చెందిన ఎస్‌ఎల్‌వీ గ్రూప్ చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు కోటి రూపాయలు విరాళం ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామంలో నిర్మిస్తున్న ఇస్కాన్ టెంపుల్ వద్ద హరే కృష్ణ గోకుల క్షేత్రంలో జరిగిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్ల నిర్వహణ నిమిత్తం శ్రీనివాసరాజు వారి కుటుంబసభ్యులతో కలిసి తమ వంతు సాయంగా కోటి రూపాయల చెక్కు అందజేశారు. అదేవిధంగా ఇస్కాన్ టెంపుల్ నిర్మాణానికి కోటి ఎనిమిది లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలకు తన వంతు సహకారంగా ఈ మొత్తాన్ని అందజేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను సీఎం చంద్రబాబు అభినందించారు.



టెన్నిస్ పోటీలకు హాజరైన బాలబాలికలతో నిర్వాహకులు

రాష్ట్రస్థాయి బాల బాలికల టెన్నిస్ పోటీలు ప్రారంభం

పాలకొల్లు రూరల్, జూలై 13 : పట్టణంలోని శ్రీమామిడి వెంకట శివయ్య మెమోరియల్ టౌన్‌హాల్ ఆధ్వర్యంలో అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను కార్యదర్శి ముచ్చర్ల ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ బి.మోహన్ కళ్యాణ్ మాట్లాడుతూ రెండురోజుల పాటు నాక్ అవుట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి 30 మంది బాలబాలికలు విచ్చేశారన్నారు. అండర్ -8, 10, 12, 14 బాలబాలికలను నాలుగు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కొటికలపూడి కృష్ణ, రావూరి చాచా, వీరా బాబ్జీ, ఎం. అనూరాధ, జక్కంపూడి వెంకటరంగారావు, ఆకుల అరవిందుడు, ఎస్. సూరిబాబు, అడ్డాల రాంబాబు, కోచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూలై 13 : ఉద్యోగం నిమిత్తం బెంగళూరు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ మంగయ్య శనివారం తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాలివి.. పట్టణానికి చెందిన వెంపాటి వెంకట శివసాయిరాం ఇంజనీరింగ్ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈనెల ఏడో తేదీన బెంగుళూరు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడన్నారు. ఆ తర్వాత నుంచి తన కుమారుడి ఫోన్ పనిచేయడంలేదని, ఏమయ్యాడో తెలియడంలేదని తండ్రి వెంపాటి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

టిప్పర్ లారీల సమ్మె ఉధృతం

▸ మూడు జిల్లాల్లో ఇసుక ఇబ్బందులు
▸ నిలిచిన భవన నిర్మాణ పనులు
▸ బిల్డింగ్ ప్లాన్ నిబంధన విరమించాలి
▸ ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి
▸ లారీ యజమానుల విజ్ఞప్తి
▸ పులిదిండి, గోపాలపురంలలో అక్రమ తవ్వకాలు ?

పాలకొల్లు, జూలై 13 : ఉమ్మడి జిల్లాలో ఇసుక సరఫరా చేసే టిప్పర్ లారీల సమ్మె ఉధృతమైంది. తూర్పు గోదావరి జిల్లాలో అప్రూవల్ ప్లాన్ ఉంటేనే ఇసుక ఎగుమతి చేసే నిబంధనలను అధికారులు అమలు చేయడంతో ఈనెల పదో తేదీ నుంచి ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో టిప్పర్ లారీల యజమానులు సమ్మెకు దిగారు. ఈ మేరకు నాలుగు రోజులుగా ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇసుక సరఫరా నిలిపి వేశారు. దీంతో నిర్మాణ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. కోనసీమ జిల్లాలో ఇసుక ఎగుమతులు యథావిధిగా జరుగుతున్నాయి. ఆధార్ కార్డు ఉంటే ఇసుక సరఫరా చేస్తుండగా, రాష్ట్రం అంతా ఇదే విధానం అమలు జరుగుతుండగా.. తూర్పు గోదావరి జిల్లాలో మాత్రం అప్రూవ్డ్ ప్లాన్ ఉంటేనే ఇసుక ఇస్తామని అనడం పట్ల టిప్పర్ లారీ యజమానులు, అసోసియేషన్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సమ్మెకు దిగారు. రాష్ట్రం అంతటా అమలు అవుతున్న విధానాన్నే తూర్పు గోదావరి జిల్లాలో అమలు చేయాలని లారీ యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని తూర్పు గోదావరి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని లారీ యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల తీరుపై అసహనం..

ఆధార్ కార్డు తెచ్చుకుంటే ఇసుకను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు తరలించుకునే వెసులు బాటును గనుల శాఖ మంత్రి కల్పించినప్పటికీ తూర్పుగోదావరి జిల్లాలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల టిప్పర్ లారీ యజమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు





ఇసుకలేక నిలిచిన భవన నిర్మాణ పనులు

కోనసీమ జిల్లాలో ఇసుక ఎగుమతుల రశీదు

పులిదిండి, గోపాలపురంలలో తవ్వకాలు అధికం..

కోనసీమ జిల్లాలో స్టాక్ పాయింట్ల నుంచి అధికారికంగా అమ్మకాలు జరుగుతుండగా పులిదిండి, గోపాలపురం ర్యాంపులలో రాత్రి సమయాల్లో పెద్దఎత్తున ఇసుక తవ్వి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత బుధవారం పెరవలిలో అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక లారీలను సీజ్ చేశారు. అయినప్పటికీ అక్రమ ఇసుక ఎగుమతులు ఆగలేదని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ళలోనే ఇసుకను కేవలం నాలుగు రోజులలో అక్రమ అమ్మకాలు జరిపి కోట్లాది రూపాయలు ఆర్జించిన కొందరు ప్రజాప్రతినిధులు కోనసీమలోనూ దందా ప్రారంభించారని పలువురు చెబుతున్నారు. మూడు జిల్లాల్లో ఏర్పడిన ఇసుక విషయంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

ఆస్పత్రి భవన నిర్మాణంలో నాణ్యతా లోపం

▸ మంత్రి నిమ్మల అసహనం.. కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు

పాలకొల్లు టౌన్, జూలై 13: పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా పెంచుతూ నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రారంభం కాకుండానే స్లాబ్ నుంచి వర్షం నీళ్లు కారడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. లోపలకి వెళ్లి చూడగా ఫ్లోరింగ్ ఎత్తు పల్లంగా ఉండి నాలుగు అంగుళాల మేరకు నీళ్లు నిలిచిపోయాయి. అంతేకాకుండా నీళ్లు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆయన ఒక్కసారిగా అధికారులు, కాంట్రాక్టర్ పైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం నిర్మాణంలో పూర్తిగా నాణ్యత లోపించిందని దీనికి బాధ్యు లు ఎవరంటూ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆయన నిలదీశారు. అక్కడ నుంచే ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పాలకొల్లులో వంద పడకల ఆసుపత్రి భవనాన్ని నిర్మించేందుకు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2019లో రూ.12కోట్ల 60 లక్షలు నిధులను మంజూరు చేశారని, దీంతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వంద పడకల ఆసుపత్రి భవనం నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. అప్పట్లో ఏడాది కాలంలో భవన నిర్మాణం పూర్తిచేసేలా టెండర్‌లో అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందన్నారు. దురదృష్టవశాత్తు ప్రభుత్వం మారిందన్నారు. నిధులు ఉండి ఏడాది కాలంలో పూర్తి చేయాల్సిన భవనాన్ని వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కూడా పూర్తిచేయలేకపోయిందన్నారు.



అధికారులు, కాంట్రాక్టర్‌పై మంత్రి నిమ్మల ఆగ్రహం

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి పైలట్ ప్రాజెక్టు

▸ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసమూర్తి

ఏలూరు క్రైం, జూలై 13 : కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారం కోసం పైలట్ ప్రాజెక్టుగా చర్యలు తీసుకున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ శనివారం ఉదయం పోలీసు అధికారులతో కో-ఆర్డినేషన్ మీటింగ్, వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించారన్నారు. ఈ కాన్ఫరెన్సులో తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారన్నారు. జిల్లాలో 1,291 నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని సత్వరమే అమలు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారన్నారు. 2014 నుంచి ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సాక్షులకు సమన్లను త్వరితగతిన అందించాలని వారికి రక్షణ కల్పించి సకాలంలో కోర్టులలో సాక్ష్యాలు చెప్పించాలన్నారు. అండర్ ట్రైల్ ప్రిజనర్స్ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు కొన్ని సమయాల్లో పోలీసు దర్యాప్తు అధికారులు ఆ కేసులు ఉన్న ఇతర సాక్ష్యులు కోర్టులకు హాజరు కాకపోవడం వల్ల ఆలస్యం అవుతుందన్నారు. ఇలాంటి సమస్యలు అధిగమించడానికి పైలట్ ప్రాజెక్టు కింద పెట్టి కేసుల్లోని దర్యాప్తు అధికారులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా సాక్ష్యం చెప్పడం కాకుండా విచారణ కూడా చేస్తారన్నారు. దీని వల్ల త్వరితగతిన కేసులు పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఖైదీలను కూడా ఆన్‌లైన్ ద్వారానే ప్రవేశపెట్టి విచారణ చేస్తామన్నారు.



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసమూర్తి

క్రైం కార్నర్

ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా..

▸ కారు ఢీ కొని కొబ్బరి దింపు కార్మికుడి మృతి

ఆచంట, జూలై 13 :ఆచంట శివారు కౌరుపాలెం వద్ద కారు ఢీకొని పెనుమంచిలి శివారు ఇసుక గరువుకు చెందిన కొబ్బరి దింపు కార్మికుడు కర్ని సుందరరావు (55) మృతి చెందారు. ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. శనివారం సాయంత్రం పెనుమంచిలి నుంచి ఆచంట పెదపేటకు కర్ని సుందరరావు మోటారు సైకిల్‌పై బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఆచంట కౌరుపాలెం వద్ద చిన్న కారు ఢీ కొట్టడంతో తీవ్ర గాయా లయ్యాయి. స్థానికులు 108 వాహనంలో పాలకొల్లు ఆసుపత్రికి తీసుకెళు తుండగా మార్గమధ్యలో పోడూరు మండలం తూర్పుపాలెం వద్ద మృతి అతడు చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు కృష్ణంరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

జామాయిల్ చెట్టు కొమ్మ మీద పడి మహిళ మృతి

జంగారెడ్డిగూడెం, జూలై 13 : జంగారెడ్డిగూడెంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన గుత్తుల వీరమణి(54) జామాయిల్ చెట్టు కొమ్మ విరిగి పడడంతో మృతి చెందిందని మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. స్థానిక రాజీవ్‌నగర్‌లో ఈనెల 12వ తేదీన ఉదయం గుత్తుల వీరమణి తమ ఇంటి నుంచి బయటకు వస్తుండగా పక్కనే ఉన్న జామాయిల్ చెట్టు పెద్దకొమ్మ విరిగి మీదపడడంతో స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ఆమె కోడలు భర్తకు ఫోన్ ద్వారా సమాచారమందించడంతో కుమారుడు తన తల్లిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మళ్లీ స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. ఆమె కుమారుడు గుత్తుల నాగమల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.




పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం పాలా శ్రీనివాస్, డి.నాగదేవి

పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పాలా శ్రీనివాస్

భీమవరం రూరల్/యలమంచిలి, జూలై 13: పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం(గ్రేడ్1, గ్రేడ్5) అధ్యక్షుడిగా పాలా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా డి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా దేవాబత్తుల నాగదేవి, కోశాధికారిగా సుంకర వెంకటేష్, ఉపాధ్యక్షులుగా జీవీఎల్ నర్సింహరావు, కె.వి.రామారావు, వి.కల్యాణి, సీహెచ్.చంటిబాబు, పి.వీర్రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ఆర్.వి.బ్రహ్మం, బి.సతీష్‌కుమార్, వై.మునిరాజు, జి.వి.టి. నాయుడు, జి.రాధాలక్ష్మిప్రశాంతి, జాయింట్ సెక్రటరీలుగా ఎం.ప్రవీణ్‌కుమార్, జి.శ్రీనివాస్, డి.ఎస్.ఆర్.ప్రసాద్, జి.సుబ్బారావు, వంగా రాజులను ఇరవై మండలాల నుంచి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన ఎన్నికైన కార్యవర్గాన్ని పంచాయతీ కార్యదర్శులు అభినందించి, సత్కరించారు. జిల్లా అధ్యక్షుడిగా, యలమంచిలి పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాస్‌ను సర్పంచ్ బర్రె మేరీ, ఎంపీటీసీ సభ్యురాలు చిలుకూరి రాజ్యలక్ష్మి, తాళ్లూరి బుజ్జిబాబు తదితరులు అభినందించారు.

గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కేంద్ర బృందం పర్యటన



కేంద్ర బృందానికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

నరసాపురం రూరల్, జూలై 13:మండలంలోని వైఎస్‌పాలెం, రుస్తుంబాద, సీతారాంపురం గ్రామాల్లో శనివారం ఎన్ఆర్ఈజీఎస్ కేంద్ర బృందం పర్యటించింది. ఉపాధి హామీ పథకం డైరెక్టర్ జి.జితేంద్రసింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ మౌనిక సింగ్ ఎంపిక చేసిన ఎన్ఆర్ఈజీఎస్ పనుల్ని తనిఖీ చేశారు. గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. పని దినాలు, ఇస్తున్న కూలీ, పనుల్లో నాణ్యత తదితర విషయాలపై ఆరా తీశారు. ఈమేరకు సర్పంచ్ నాగముత్యామాంబ, వెంకట్, భారతి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షులు వైఎస్ బాబు ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించాలని, కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపునకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని, ఉపాధి కార్మికులందరికీ మజ్జిగ సరఫరా చేయాలని వినతిపత్రం అందించారు. డ్వామా పీడీ ప్రభాకరరావు, డీఈ శ్రీనివాస్, ఆకన శ్రీదేవి వాసు, ప్రకాశ్, వై. సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాలీ నుంచి దూసుకొచ్చి..



▸ త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కాకినాడ నుంచి ముంబైకి లోహపు పైపుల లోడుతో అశ్వారావుపేట వైపు వెళుతున్న ట్రాలీ లారీ జీలుగుమిల్లి సమీప నాలుగు రోడ్ల కూడలి వద్ద హైవేపై శనివారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. ఇటీవల హైవేపై మరమ్మతుల కోసం రోడ్డు తవ్వారు. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నందున పనులు నిలిచిపోయాయి. నీళ్లు చేరిన ఆ గోతుల్ని తప్పించే క్రమంలో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న లోహపు పైపుల్లో ఒకటి ముందుకు క్యాబిన్‌లోంచి చొచ్చుకుని బయటకు వచ్చింది. డ్రైవర్ అప్రమత్తమై ప్రమాదం బారి నుంచి బయట పడ్డాడు.

- జీలుగుమిల్లి



ఐసీఏఆర్-ఐఐఓపీఆర్ డైరెక్టర్ సురేష్, ఆర్‌టీఐ కమిషనర్ సునీల్‌కు శ్రీవారి చిత్రపటాలు అందిస్తున్న అధికారులు

వేంకటేశ్వరస్వామికి ప్రముఖుల పూజలు

ద్వారకాతిరుమల, జూలై 13:చినవెంకన్న ఆలయాన్ని ఐసీఏఆర్-ఐఐఓపీఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రీసెర్చ్) డైరెక్టర్ డాక్టర్ కంచర్ల సురేష్, సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ చావలి సునీల్ శనివారం సందర్శించారు. కుటుంబసమేతంగా విచ్చేసిన ఐసీఏఆర్-ఐఐఓపీఆర్ డైరెక్టర్‌కు, ఆర్‌టీఐ కమిషనర్ సునీల్‌కు ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. తొలుత గర్భాలయంలో కొలువైన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు వారికి స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు. ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు వారికి శ్రీవారి చిత్రపటాలు, ప్రసాదాలు, మెమెంటోలను అందించారు.

11 మంది జూదరుల అరెస్టు

▸ 52 వేల 30 రూపాయలు స్వాధీనం

ఏలూరు క్రైం, జూలై 13 : ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలో ఉన్న గ్రాండ్ ఆర్య హోటల్‌లో పేకాటాడుతున్న 11 మందిని అరెస్టు చేశామని ఏలూరు త్రీ టౌన్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. శనివారం కొంతమంది పలు ప్రాంతాల నుంచి హోటల్‌కు వచ్చి పేకాటాడుతున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఆ హోటల్‌లో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి 52 వేల 30 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా పలు ప్రాంతాల నుంచి ఆ హోటల్‌కు వచ్చి పేకాట ఆడుతున్నట్టుగా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

అత్తపై కత్తితో అల్లుడి దాడి.. కేసు నమోదు

ద్వారకాతిరుమల, జూలై 13: తన భార్య ఎక్కడికి వెళ్లిందో చెప్పమని అత్తతో గొడవకు దిగి ఆమెను కత్తితో నరకబోయిన అల్లుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.సతీష్ తెలిపారు. మండలంలోని తూర్ల లక్ష్మీపురానికి చెందిన గాది శేషమ్మకు ఇద్దరు సంతానం. గత కొంతకాలం క్రితం తన కుమార్తెను మండలంలోని ఐఎస్ రాఘవాపురానికి చెందిన బోడపాటి వెంకటేశ్వరరావుతో వివాహమైంది. భర్తతో వివాదం జరిగి ఈనెల 8న పుట్టింటికి వెళ్లింది. అదే రోజున ఉదయం వెంకటేశ్వరరావు తన అత్త శేషమ్మ ఇంటికి వెళ్లి తన భార్య ఎక్కడికి వెళ్లిందో చెప్పాలంటూ గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఆమెను కొట్టి కత్తితో పీకపై నరకబోగా ఆమె చేయి అడ్డు పెట్టడంతో మణికట్టు తెగిందని పోలీసులు తెలిపారు. బాధితురాలిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి పంపారని అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు అతడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బంధువుల చెంతకు తప్పిపోయిన యువతి

భీమవరం క్రైం, జూలై 13 : కాలేజీ నుంచి ఇంటికి తీసుకువస్తుండగా రైలులో తప్పిపోయిన యువతిని శనివారం రైల్వే పోలీసులు బంధువులకు అప్పగించారు. భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పీటీవీ రమణ తెలిపిన వివరాలివి.. కాళ్ళ మండలం ఆనందపురం గ్రామానికి చెందిన కొల్లాటి పెద్దిరాజు కుమార్తె కాకినాడ కళాశాలలోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుంది. గత నెల 7వ తేదీన పెద్దిరాజు కాకినాడ వెళ్లి తన కుమార్తె కళ్యాణిని శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి తీసుకువస్తున్నారు. ఆ సమయంలో ఆమె తప్పిపోయింది. పెద్దిరాజు భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీసులకు గత నెల 12వ తేదీన ఫిర్యాదు చేయడంతో స్పెషల్ బృందాలు గాలించాయి. కళ్యాణి హైదరాబాద్‌లోని మాదాపూర్ పీజీ హాస్టల్‌లో ఉన్నట్లుగా గుర్తించి ఆమెను శనివారం భీమవరం తీసుకువచ్చారు. ఆమె తల్లిదండ్రులతో వెళ్ళడానికి నిరాకరించడంతో భీమవరంలో ఉమెన్ వెల్ఫేర్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇచ్చి చేర్పినట్టుగా రైల్వే ఎస్ఐ రమణ తెలిపారు. కేసున చేధించి యువతిని గుర్తించినందుకు పోలీసులకు యువతి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

పాలకొల్లు రూరల్, జూలై 13 : దగ్గులూరు గ్రామంలో శనివారం ఉదయం జనగం సత్యనారాయణ నివాసంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఏసీ, ఫ్రిజ్, వంటగదిలోని వంట పాత్రలు కాలిపోయాయి. ఉదయం సమయంలో ఇంటికి తాళం వేసి అతడు తన భార్యతో కలసి పాలకొల్లు వెళ్లాడు. ఈక్రమంలో ఇంట్లోంచి పొగలు రావడంతో స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చిమంటలను అదుపు చేశారు. ఇంట్లో సామగ్రి పాక్షికంగా దగ్ధం అయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులను గ్రామానికి చెందిన మండల పరిషత్ ఫ్లోర్ లీడర్ శాగా సత్యనారాయణ పరామర్శించారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల ఇటీవల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



దగ్గులూరులో కాలిన ఇంట్లోని వస్తువులు

మారేడుబాకలో పూరిళ్లు దగ్ధం

కుక్కునూరు, జూలై 13: కుక్కునూరు మండల పరిధిలోని మారేడుబాక గ్రామంలో శుక్రవారం రాత్రి పిట్రా శాంతమ్మ, కుమ్మరిపల్లి అలివేలు అనే మహిళలకు చెందిన పూరిళ్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో ఇంటిలో ఉన్న పించన్ సొమ్ములు రూ.14వేలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రభుత్వ సాయం అందించాలని వారు కోరుతున్నారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరం, జూలై 13 : పోలవరంలో గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులు శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీర, పూర్ణ, ప్రవర నదుల నుంచి గోదావరిలో వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో గోదావరిలో నీటిమట్టం రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతుంది. స్పిల్‌వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్‌వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.040 మీటర్లు, స్పిల్‌వే దిగువన 17.190 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 27.130 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 16.180 మీటర్లు నమోదయ్యాయని ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 7,080 క్యూసెక్కులు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,080 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు శనివారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.538 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 20 పంపులు 20 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

స్వాగత బోర్డులపై జగన్ బొమ్మలు

అధికారం మారినా మార్చని బోర్డులు



పాలకోడేరు, జూలై 13: కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు గడుస్తున్న గ్రామ కూడళ్లలో ఏర్పాటు చేసే స్వాగతం బోర్డులపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బొమ్మ ఇంకా దర్శనమివ్వడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. గొల్లలకోడేరు పంచాయతీ పరిధిలోని గొల్లలకోడేరు మీదుగా గరగపర్రు వెళ్ళే మార్గంలో ఐస్‌ఫ్యాక్టరీ సమీపంలోను, గొల్లలకోడేరు నుంచి పాలకోడేరు వైపు వెళ్ళే మార్గంలోని యనమదుర్రు డ్రైన్ బ్రిడ్జి వద్ద మరికొన్ని కూడళ్ళలో స్వాగతం బోర్డుల పై జగన్‌బొమ్మను తొలగించలేదు. చాలా గ్రామాల్లో స్వాగతం బోర్డుల పై ఉన్న జగన్ బొమ్మల పై రంగులు వేసి కనిపించకుండా చేసినప్పటికీ గొల్లలకోడేరు గ్రామంలో మాత్రం అధికారులకు అవేమి తమకు పట్టవన్నట్లు వదిలేశారు. దీంతో అటుగా వెళ్ళే ప్రయాణికులు స్వాగతం బోర్డుపై ఉన్న జగన్ బొమ్మను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

భీమవరం క్రైం, జూలై 13 : మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో శనివారం హెచ్‌ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు పెన్మెత్స రామ్మోహన్‌వర్మ, కార్యదర్శి వేమూరి రాంబాబు, ఛైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అల్లు శ్రీనివాస్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం గోవిందబాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సీఐ



భీమవరం క్రైం, జూలై 13 : సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని రెండో పట్టణ సీఐ జి.శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన అవసరమంటూ ఏర్పాటు చేసిన బ్యానర్లను సీఐ శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని, ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీయం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మేసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ఆర్‌ఆర్‌డిఎస్ కళాశాల అధ్యాపకులు పి అమూల్యరావు, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

డీఎన్నార్‌కు అటానమస్ హోదా



అటానమస్ ఉత్తర్వులు అందుకుంటున్న డీఎన్నార్ పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు నరసింహరాజు

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 13 : డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్వయం ప్రతిపత్తి స్థాయిని కల్పిస్తూ ఉత్వర్వులు జారీ చేశారని కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు తెలిపారు. శనివారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ కళాశాల అందిస్తున్న విద్య, శిక్షణ, ప్లేస్‌మెంట్స్ వంటి నాణ్యతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ఎన్‌ఏఏసీ అత్యుత్తమ గ్రేడ్ ఏ++ను అందించిందని, నేషనల్ అక్రెడిటేషన్ బోర్డు గుర్తింపు లభించిందని, ఇప్పుడు కళాశాలను స్వయం ప్రతిపత్తి కళాశాల (అటానమస్ కళాశాల)గా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ప్రకటించడం గర్వించదగ్గ విషయం అన్నారు. కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, పాలకవర్గ అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, ప్రిన్సిపాల్ డా.ఎం అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

పెరటి మొక్కలతో ఆరోగ్యం, ఆదాయం



మాట్లాడుతున్న ముత్యాల సత్తిరాజు

పాలకొల్లు అర్బన్, జూలై 13 : ప్రతీ ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో లేదా డాబాలపైన పెరటి మొక్కలు పెంచడం వల్ల ఆరోగ్యంతోపాటు ఆదాయం కూడా సమకూర్చుకోవచ్చునని పర్యావరణవేత్త ముత్యాల సత్తిరాజు (వేల్పూరు) అన్నారు. రేపాక వారి సత్రంలో శనివారం ప్రకృతి నేస్తం అడ్మిన్స్ నిర్వాహకురాలు కంభంపాటి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్తిరాజు ముఖ్య వక్తగా విచ్చేసి మాట్లాడారు. అందరూ క్రిమి సంహార మందులు వాడకుండా, సేంద్రియ పద్ధతుల ద్వారా పెరటి మొక్కలు పెంచాలన్నారు. అనంతరం మహిళలకు పెరటి మొక్కలు, పూలమొక్కలను అందజేశారు. కార్యక్రమంలో ఆగర్రు పంచాయతీ కార్యదర్శి ఆనంద్, పి లక్ష్మణ రావు, సత్రం ఫౌండర్, ఛైర్మన్ రేపాక శ్రీనివాసరావు, ట్రస్టీలు, బ్రాహ్మణ సంఘం నాయకురాలు పెండ్యాల భవానీ మాట్లాడారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ దుర్గా మల్లేశ్వరి, డాక్టర్ గిరీష్‌లు ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



ఆచంట, జూలై 13: కొడమంచిలిలో తురకవానిమెరక రోడ్డులో ఉన్న బ్రాందీ షాపు వద్ద రోడ్డు మీద మద్యం కొనుగోలుదారులు వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీనితో ఈ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వందల కొద్ది వాహనాలు రోడ్డు మీదే ఉండటంతో ఆ సమయంలో అనేక మంది విద్యార్థులు అలాగే పలు స్కూళ్ళకు సంబంధించి వాహనాలు వెళ్ళటకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులపై వాహనాలు పెట్టకుండా చూడాలని కోరుతున్నారు.

రక్తదానం



రక్తదానం చేసిన వ్యక్తికి సర్టిఫికెట్ అందిస్తున్న డాక్టర్

ఆకివీడు, జూలై 13: రక్తదానం చేసి ప్రాణాలు కాపాడడం పూర్వ జన్మ సుకృతమని డాక్టర్ బిలాల్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ ఆకివీడు శాఖ ఆధ్వర్యంలో శనివా రం ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో స్థానిక షాదీఖానాలో 62 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేయడం వలన కొత్త రక్తంతో ఆరోగ్యవంతులుగా జీవించవచ్చునన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ ఆకివీడు శాఖ అధ్యక్షుడు ఎస్డీ ఫారూక్, ఎండీ మస్తాన్‌వలీ, జక్కీ అహ్మద్, ఎండీ అహ్మద్ పాల్గొన్నారు.

జనసైనికుడికి ఆర్థిక సాయం



ఉండి జూలై 13: ఉండిలో జన సైనికుడు చిప్పాడా వెంకటేశ్ ప్రమాదవశాత్తు గాయపడగా 12 కుట్లు పడ్డాయి. ఈసమాచారం తెలుసుకున్న నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు శనివారం బాధితుడి ఇంటికి విచ్చేసి పరామర్శించారు. రూ.10500 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మండల జనసేన కన్వీనరు యడవల్లి వెంకటేశ్వరరావు, గ్రామ జనసేన అధ్యక్షుడు ఆరేపల్లి వెంకటేష్, మోపిదేవి హరి, రమేష్ పాల్గొన్నారు.





ఇరగవరం మండలం అయితంపూడి రహదారి.. ఉండిలో బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో నిలిచిన నీరు.. గొల్లలకోడేరులో మునిగిన రోడ్డు

జోరు వాన

పల్లపు ప్రాంతాలు, నారుమడుల మునక

ఉండి, జూలై 13: ఉండిలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లల్లోకి నీరు చేరింది. స్టేషన్‌రోడ్ నుంచి వెంకటేశ్వరసామి ఆలయానికి వెళ్లే సీసీ రహదారిపై వర్షపునీరు చేరింది. జగన్ననకాలనీ, చెరుకువాడలోని యానాదుల కాలనీలు వర్షపునీటిలో మునిగాయి. పలుగ్రామాలలో రహదారులు అధ్వానంగా మారాయి. బస్టాండ్‌లో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో ఆపనులను చేపట్టారు. బస్టాండ్ ఇన్ అవుట్ ప్రాంతాలలో వర్షపునీటితో ప్రమాదకరంగా మారాయి. వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేక బస్‌స్టాండ్ ఆవరణంతా అధ్వానంగా మారింది.

మునిగిన ఆకుమడులు

నరసాపురం రూరల్, జూలై 13: వారం రోజులుగా తీరంలో కురుస్తున్న వర్షాలకు ఆకుమడులు, నారుమడులు నీటిలో మునిగిపోయాయి. చిట్టవరం, సీతారాంపురం, రుస్తుంబాదా, ఎల్‌బిచర్ల, కొప్పర్రు, మల్లవరం, చినమామిడిపల్లి తదితర ప్రాంతాల్లో పూర్తిగా మునిగిపోయాయి. అదిలోనే వర్షాలు రైతుల్ని దెబ్బతీయడంతో మళ్లీ ఆకుమడులు వేసేందుకు పెట్టుబడులు వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో వెతలు



ఉండి ఆర్టీసీ బస్టాండ్ వద్ద వర్షపు నీరు

తణుకు, జూలై 13: శనివారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల రైతులు రోజువారి పనులు చేసుకునే వీలులేకుండా పోయింది. అలాగే వ్యాపారులు కూడా అమ్మకాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క పలుచోట్ల పల్లపు ప్రాంతాల్లో ఉన్న వరిచేలు నీట మునిగే అవకాశాలు ఉన్నాయి. ఎక్కడికక్కడ రైతులు పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నీట మునిగిన రహదారులు

పాలకోడేరు, జూలై 13: భారీ వర్షానికి మండలంలోని అనేక గ్రామాల్లో రహదారులు నీటమునిగాయి. గొల్లలకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, వేండ్ర, శృంగవృక్షం తదితర గ్రామాల్లో వర్షాకాలం వచ్చినప్పటికి డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రహదారులు వర్షపునీరు వెళ్ళే దారిలేక గ్రామ పంచాయతీ రహదారులు నీటమునిగాయి. మురుగునీటిలో ప్రయాణం చేయ్యలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు

ఇరగవరం, జూలై 13 : రహదారుల అభివృద్ధిపై వైసీపీ ఐదేళ్ళ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. మండలంలోని పలు రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓగిడి-అయితంపూడి రహదారి గుంతలమయంగా మారి వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గోతుల రహదారుల్లో పడి పలువురు గాయాలపాలైన సందర్భాలున్నాయి. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి రహదారులకు తాత్కాలిక మరమ్మతులైనా చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి, కలెక్టర్ ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో పసిపాపను ఎత్తుకుని బాలింతరాలితో మాట్లాడుతున్న మంత్రి

పాలకొల్లు టౌన్, జూలై 13: పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వైద్య విభాగాలన్నింటినీ పరిశీలించారు. వార్డుల్లో పర్యటించి రోగులకు అందిస్తున్న వైద్యసదుపాయాలను పరిశీలించారు. ప్రసూతి వార్డులోని బాలింతలు దగ్గరకు వెళ్లి తల్లులకు, పిల్లలకు అందిస్తున్న వైద్యసదుపాయాలపై ఆసుపత్రి వైద్యులను, సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం వార్డులోని ఒక చిన్నారిని ఎత్తుకుని ముచ్చటించారు.

పాలకొల్లు అర్బన్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలకొల్లులో 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణపనులు త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వర్షపు నీరు ఆసుపత్రిలోకి రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చామన్నారు. ఈసందర్భంగా 100 పడకల ఆసుపత్రి నూతన భవన నార్మాణ పనులు పరిశీలించారు.

సాదాసీదా కస్టమర్‌లా..

నరసాపురం, జూలై 13: నిత్యం ప్రజల్లో ఉంటూ వినూత్న కార్యక్రమాలు చేపట్టే మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం సాదాసీదా కస్టమర్‌లాగా పట్టణంలోని ఒక హోటల్‌లో అల్పాహారం చేశారు. పాలకొల్లు నుంచి అమరావతి వెళుతూ పట్టణంలోని సెంటర్‌లో తేజ హోటల్ ముందు ఆగారు. మంత్రి ఎస్కార్ట్ జీపు ఆగడంతో హోటల్ యాజమాని కాగిత వెంకటేశ్వరావు కొద్దిగా కంగారుపడ్డారు. వెంటనే కౌంటర్ దిగి బయటకు వచ్చి చూశారు, మంత్రి రామానాయుడు హోటల్‌లోకి వస్తుండటంతో ఆనందపడ్డాడు. ఎదురెళ్లి మంత్రిని హోటల్‌లోకి తీసుకొచ్చాడు. అయితే మంత్రి రామానాయుడు నాకు మార్యాదలొద్దు.. కస్టమర్‌గా మీ హోటల్‌కి వచ్చానంటూ ఆయనే స్వయంగా తనకు నచ్చిన టిఫిన్‌ను తెచ్చుకుని తిన్నారు. ఆ సమయంలో అయన్ను కలిసేందుకు వచ్చిన కస్టమర్లను పలకరించి ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు.

మత్స్యశాఖ అధికారిగా రాజు

నరసాపురం రూరల్, జూలై 13: మండల మత్స్యశాఖ అధికారిగా ఎస్ రాజు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేస్తున్న భారతి ట్రైనింగ్ నిమిత్తం వెళ్లారు. దీంతో పాలకొల్లు ఎఫ్‌డీవోగా పని చేస్తున్న రాజును ఇక్కడ ఇన్‌చార్జి మత్స్యశాఖ అధికారిగా నియమించారు.

గరకట్టలను తొలగించాలి

నరసాపురం రూరల్, జూలై 13: మండలంలోని దర్బరేవు డ్రెయినేజీ వెంబడి ఉన్న గరకట్టలను తొలగించడంతో పాటు లాకు తలుపుల మరమ్మతు పనులు చేపట్టాలని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు బొడ్డు ఆశిష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ డ్రెయినేజీని ఆనుకుని సుమారు 600 ఎకరాలు వరకు రైతులు సాగు చేస్తున్నారన్నారు. ఆక్వా రైతులు డ్రెయినేజీ గుండా గరకట్టలు ఏర్పాటు చేయడం వల్ల ముంపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక ప్రతి ఏటా రైతులు పంటను నష్టపోతున్నారన్నారు.

డ్రెయిన్‌లను ఆధునీకరిస్తాం: నాయకర్

నరసాపురం రూరల్, జూలై 13: నియోజకవర్గంలో పూడుకుపోయిన మురికికాల్వలను త్వరలో ఆదునీకరిస్తామని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. శనివారం మండలంలోని సీతారాంపురం మురికికాల్వ తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనుల్ని ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ప్రారంభించారు. వర్షాకాలంలో రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న డ్రెయినేజీల సమస్యను పరిష్కరించి రైతులకు మేలు చేస్తామన్నారు. చేపట్టిన పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలవకొలను తాతాజీ, రవీంద్ర, ఆకన సుబ్రమణ్యం, కొప్పాడ రవి, ఏసు, వెంకట్రావు పాల్గొన్నారు.

హైవే అప్రోచ్ రోడ్లు పునరుద్ధరించాలి



చినతాడేపల్లి అప్రోచ్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 13: జాతీయ రహదారులకు అనుసంధానమైన అప్రోచ్ రోడ్లు వేయాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. హైవే అథారిటీ అధికారులతో కలసి శనివారం ఆయన చినతాడేపల్లి వద్ద అధ్వానంగా ఉన్న అప్రోచ్ రోడ్లను పరిశీలించి మాట్లాడుతూ వెంటనే గోతులు పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అప్రోచ్ రోడ్డు వేయాలన్నారు. ఆయన వెంట హైవే అథారిటీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అమర వీరులకు నివాళులు



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 13:ఈ నెల 8న కశ్మీర్‌లో ఆర్మీ వాహనంపై ఉగ్ర దాడిలో మృతి చెందిన అమరవీరులను స్మరిస్తూ మండలంలోని మిలిటరీ మాధవరం అమరవీరుల స్థూపం వద్ద శనివారం నివాళులర్పించారు. మాజీ సైనికోద్యోగ సంఘ నాయకులు, వీర మాతలు పాల్గొన్నారు.

కంటి శుక్లం శస్త్ర చికిత్సలో ఆధునిక టెక్నాలజీ



మాట్లాడుతున్న డాక్టర్ సందీప్ రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 13: కంటి శుక్లం శస్త్ర చికిత్సలో అత్యాధునిక లెన్స్ టెక్నాలజీతో లక్షలాది మంది తిరిగి చూపు పొందుతున్నారని తాడేపల్లిగూడెం నేత్ర వైద్యుడు డాక్టర్ సందీప్ రెడ్డి పేర్కొన్నా రు. హైదరాబాద్‌లోని ఆప్తమాలజికల్ సొసైటీ 9వ వార్షికోత్సవ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఇంట్రా ఆక్యులర్ లెన్స్‌తో కంటి శుక్లం సమస్య శాశ్వతంగా పరిష్కరించవచ్చన్నారు. దేశ, విదేశీ లెన్స్‌తో వేచుక్కను పూర్తిగా నివారించి చూపును ప్రసాదించవచ్చని వైద్యులకు వివరించారు. అనంతరం సందీప్‌రెడ్డిని ఆప్తమాలజికల్ సొసైటీ నిర్వాహకులు సత్కరించారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రకటన చేయాలి

పాలకొల్లు అర్బన్, జూలై 13 : బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఒక ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవానీ ఒక ప్రకటనలో కోరారు. బీసీలకు 50శాతం రిజర్వేషన్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో ఉద్యమం చేపట్టనున్నట్టు తెలిపారు.

సుబ్బారాయుడు గుడి అభివృద్ధికి కమిటీ



ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూలై 13 : వందేళ్ళ చరిత్ర కలిగిన శ్రీరాంపురంలోని రామలింగేశ్వరస్వామి (సుబ్బారాయుడు గుడి) ఆలయ పునః నిర్మాణ పనులు అత్యంత వైభవంగా జరుగుతాయని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. సుమారు రూ.కోటి 50 లక్షలతో చేపట్టిన పునః నిర్మాణ పనులను ఎమ్మెల్యే అంజిబాబు పరిశీలించారు. పునః నిర్మాణానికి ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా గాదిరాజు సుబ్బరాజు, సభ్యులుగా గన్నాబత్తుల శ్రీనివాస్, ఏఎస్ రాజు, రంగరాజు, బాబీ, చెన్నమల చంద్రశేఖర్, పొత్తూరి బాపిరాజు, గొంట్ల వెంకట నారాయణ, కనకరాజు, రామప్రసాద్ పలువురు సభ్యులను నియమించామన్నారు. ముందుగా ఆలయ అభివృద్ధికి సంబంధించిన వివరాలను ఆలయ ఈవో దండు రామకృష్ణంరాజు ఎమ్మెల్యే అంజిబాబుకు వివరించారు.

కార్బొండిజం పిచికారి చేయాలి



నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాస్

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 13: ముంపునకు గురైన నారుమడుల్లో నీరు తోడిన తరువాత కార్బొండిజం మందు పిచికారి చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాస్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని నారుమడులు పరిశీలించి మాట్లాడుతూ గునుపూడి సౌత్ డ్రెయిన్‌లో చెత్త తొలగింపు జరుగుతుందని అన్నారు.

మావుళ్ళమ్మ ఆలయానికి బంగారం అందజేత



భీమవరం టౌన్, జూలై 13 : మావుళ్ళమ్మ ఆలయానికి నరసాపురానికి చెందిన కె వెంకట సత్యనారాయణ, కాంచన దంపతులు 8 గ్రాముల బంగారం అందించారు. ఆలయానికి వచ్చిన దాతలు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ అందజేశారు.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

పాలకొల్లు అర్బన్, జూలై 13 : బీజేపీ జిల్లా లీగల్ సెల్ సమావేశం శనివారం స్థానిక కోర్టుభవనంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇలపకుర్తి రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలువురు న్యాయవాదుల సమస్యలు వివరించారు. అనంతరం రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును కలిసి లీగల్ సెల్ తరుపున పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి, నామినేటెడ్ పోస్టుల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కొప్పర్తి వెంకట్, నియోజక వర్గ నాయకులు వీరాజీ, గుప్తా, రామ్మోహన్‌రావు, ధర్మరాజు పాల్గొన్నారు.

విద్యా సంస్థలను మూయించిన ఎస్‌ఎఫ్‌ఐ

పాలకొల్లు అర్బన్, జూలై 13 : రెండవ శనివారం సెలవు ఇవ్వకుండా విద్యాసంస్థలను నడుపుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఎఐఎస్‌ఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలిసి విద్యాసంస్థల వద్దకు చేరుకుని మూయించి వేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఏఐఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి యలమల సంతోష్, ఎస్‌ఎఫ్‌ఐ కన్వీనర్ పోలిశెట్టి శేఖర్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ సుందర్ మాట్లాడుతూ కొన్ని కార్పొరేట్, విద్యాసంస్థలు సెలవు దినాల్లో కూడా నడిపిస్తున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి జూలై 13:పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ యోషయా అందించిన వివరాలు ప్రకారం.. ఉండి గ్రామానికి చెందిన కనకం నరసింహస్వామి(48) ఈనెల 8వ తేదీన భార్యతో మనస్పర్థలు వలన పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు అతనిని భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరాల వెంకన్నకు భక్తుల తాకిడి

అత్తిలి, జూలై 13: మండలంలోని ఈడూరులో గల వరాల వేంకటేశ్వరస్వామిని శనివారం అతధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత, తోమాల సేవ, విశేష అర్చనలు జరిపారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేసింది. అత్తిలి రైల్వే స్టేషన్ రోడ్డులో గల బాలాజీని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

17న తొలి ఏకాదశికి విశేష పూజలు

17న తొలి ఏకాదశి సందర్భంగా వరాల వేంకటేశ్వరస్వామికి స్వామికి 700 లీటర్ల ఆవుపాలు, 10 లీటర్ల పెరుగు, 7 కేజీల నెయ్యి, 7 కేజీల తేనె, 7 కేజీల పసుపు, 7 కేజీల కుంకుమ, 7 కేజీల తెల్ల ఆవాలు, 7 కేజీల వట్టి వేళ్ళతో మహాభిషేకం నిర్వహించనున్నట్లు వాడపల్లి శేఖరాచార్యులు తెలిపారు. అలాగే బాలాజీ వేంకటేశ్వరస్వామికి తొలి ఏకాదశి సందర్భంగా విశేష పూజలు జరుపనున్నట్లు ఆలయ అర్చకులు వల్లి వెంకటేష్, సూర్య తెలిపారు.

గ్రామ దేవతలకు ఆషాఢ సారె



కాళ్ల(ఉండి) జూలై 13: గ్రామ దేవతలకు మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. శనివారం కాళ్ల మండలం ఏలూరు పాడులో గ్రామ దేవత లైన పోలేరమ్మ, కొండాలమ్మ, మహాలక్ష్మమ్మ, పుంతల ముసలమ్మ, ఎల్లమ్మ, కనకదుర్గదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడంసారె బిందెలతో మహిళలు పెద్దఎత్తున ఊరేగింపు జరిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు సతీమణి సుష్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాదు సతీమణి శ్రీలక్ష్మీ, సర్పంచ్ జగ్గరాజు, మాజీ సర్పంచ్ మంతెన ఆంజనేయరాజు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

తూడు తొలగింపు



పూడిక తీసిన కాల్వ

తణుకు, జూలై 13: సత్యవాడ-మండపాక డ్రెయిన్ పూడికతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గత వైసీపీ ప్రభుత్వం ప్రతి ఏటా పూడిక పనులు చేయకపోవడంతో డ్రెయిన్ పూడుకుపోయి పొలాలకు సాగునీరందడం లేదని రైతులు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం పూడిక పనులు చేపట్టారు. ప్రధానంగా తేతలి, మండపాక, సత్యవాడ డ్రెయిన్లలో ఎప్పటి నుంచో పేరుకుపోయిన పూడికను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. దీంతో సాగునీరు ప్రవాహం సక్రమంగా రావడంతో రైతులు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బ్రాహ్మణుల నిరసన

పాలకొల్లు అర్బన్, జూలై 13 : బ్రాహ్మణ జాతిపైనా, మహిళలపైనా పైలా దాస్ వ్యాఖ్యలపై ఆదివారం ఉదయం 8గంటలకు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నిరసన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు బ్రాహ్మణ సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని, నిరసన కార్యక్రమం అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పైలా దాసుపై ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం అందించనున్నట్టు సంఘ నాయకులు మద్దూరి సూరిబాబు, కాశీ, మునుకుట్ల రవీంద్ర, కుమార్, ఫణి , లింగరాజు తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఆచంట, జూలై 13: వల్లూరు పంచాయతీ ఏరియాలో దోమల నివారణకు శనివారం సాయంత్రం అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో దోమల నివారణ నిమిత్తం గ్రామం అంతటా ఫాగింగ్ చేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచ్ నేలపూడి జేబి తెలిపారు.

కొత్త క్రిమినల్ చట్టాలతో ప్రమాదం



మాట్లాడుతున్న ఐలూ ఉభయ గోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి మునిస్వామి

తణుకు, జూలై 13: కొత్త క్రిమినల్ చట్టాల వల్ల ప్రమాదమని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉభయ గోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి అన్నారు. కొత్త చట్టాలకు వ్యతిరేకంగా శనివారం తణుకులో జరిగిన ఉభయ గోదావరి జిల్లాల సదస్సులో ఆయన మాట్లాడుతూ అవి ప్రజలతో కాని, న్యాయవాదులతో కాని చర్చలు లేకుండా ఆమోదించిన చీకటి చట్టాలన్నారు. సంఘ నాయకులు కొండ శ్రీనివాసరావు, పి.వేణుగోపాలరావు, గెద్దాడ విజయ భాస్కర్, వెంకట్, రాజారావు, అప్పారావు తదితరులు మాట్లాడారు.

రేపు చాంబర్స్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు అర్బన్, జూలై 13 : స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో ఈనెల 15వ తేదీ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వివిధ కంపెనీల ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ట్వీన్కోటెక్, ఇన్ఫోల్యామి, హాఫ్టెక్ కంపెనీలలో ఉద్యోగాల నిమిత్తం ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందని, హాజరు కాదలచిన వారు 2022, 2023, 2024 సంవత్సరాల్లో (ప్రస్తుతం ఫైనల్) విద్యార్థులు ఏదైనా డిగ్రీ, డిగ్రీ కంప్యూటర్, పిజీ, ఎంసీఏ, బీటెక్, బీఈ చేసిన వారు అర్హులని ఆయన తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు 2 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు కళాశాల ప్లేస్మెంట్ ఆఫసర్ యు.జానకి రామయ్య ఫోన్ నెం. 99120 46234ను సంప్రదించ వచ్చునని ప్రిన్సిపాల్ తెలిపారు.



కంతేరులో నిరుపయోగంగా సంపద కేంద్రం ... ఖాళీగా ఉన్న తొట్టెలు

సంపద కేంద్రాలు వినియోగంలోకి వచ్చేనా ?

ఇరగవరం, జూలై 13 : గ్రామాల్లోని చెత్తను సంపద సృష్టి కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆర్థిక వనరులు కల్పించడం కోసం గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రాలు నిర్మించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఇరగవరం మండలం కంతేరు గ్రామంలోని సంపద కేంద్రానికి ఇదే పరిస్థితి. నిర్మించినప్పటి నుంచి ఈ కేంద్రానికి చెత్త తరలించిన దాఖలాలు లేవు. రోడ్డుపక్కన మాత్రం చెత్తను పోగులుగా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారయింది. కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు ఎంతో ఉపయోగపడే ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.